రాష్ట్ర స్థాయి పోటీలకు నీలకంఠాపురం విద్యార్థులు

ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు రోజుల క్రితం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మండల పరిధిలోని నీలకంఠాపురం జడ్పి హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-19 విభాగంలో రాజు, ప్రజ్వల, గణేష్, షాలిని, గిరిక అత్యుత్తమ పాయింట్లు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఎసిఎఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, హెచ్ఎం చంద్రమౌళి, పిఇటి జయం రమేష్ తెలిపారు. వీరు ఈ నెలాఖరులో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

భూపోరాట రైతు ఆత్మహత్య

కొండూరులో దారుణం

భూ పోరాటంలో సమిధలవుతున్న దళిత రైతులు

కనికరించని అధికారులు

చెట్టుకు ఉరివేసుకున్న వెంకటేష్

పేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములు పెద్దల పరమవుతున్నాయి. తమ భూములను అక్రమంగా చేజిక్కించుకున్న కుశలవ కంపెనీ యాజమాన్యంపై లేపాక్షి మండలం కొండూరు రైతులు సాగిస్తున్న భూ పోరాటంలో రైతులు సమిధలు అవుతున్నారు. పెద్దలతో పోరాటంపై ఆందోళన చెందుతున్న నిరుపేద రైతులు తమ భూములు దక్కుతాయో లేదో అన్న దిగులుతో ప్రాణాలు వదులుతున్నారు. నిషేధిత జాబితాలో ఉన్నా వందల ఎకరాల భూములను కంపెనీ పేరిట 1బి ఖాతా సృష్టించిన రెవిన్యూ అధికారులు కుట్రలు, కుతంత్రలతో వారి పరం చేస్తుడడంతో పాటు రాత్రికి రాత్రే రికార్డులను సైతం మారుస్తుడడంతో పేద రైతుల్లో భయం అలుముకుంది. దీంతో బలవన్మరణాలకు దిగుతున్నారు. ఇలాంటి దయనీయమైన సంఘటన ఆదివారం శ్రీ సత్య సాయి జిల్లా లేపాక్షి మండలం కొండూరు సమీపంలో చోటుచేసుకుంది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-హిందూపురం, లేపాక్షి

లేపాక్షి మండలంలోని కుశలవ భూముల విషయంలో దిగులు చెంది రెండు నెలల క్రితం తిప్పన్న చనిపోతే అతని కుమారుడు వెంకటేష్ (35) ఆదివారం వారికి కేటాయించిన భూముల్లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లే భూ బాధితులు వారికి కేటాయించిన భూముల కోసం పోరాటం చేస్తు భూములు తమకు దక్కుతాయో లేదో అన్న దిగులుతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని దళిత రైతులతో పాటు సిపిఎం, కెవిపిఎస్ నాయకులు వాపోతున్నారు. శ్రీ సత్య సాయి జిల్లా లేపాక్షి మండలం కొండూరు గ్రామ పంచాయతీ పొలంలో దాదాపు వందల ఎకరాల ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్న భూములను నిబంధనలకు విరుద్ధంగా కుశలవ యాజమాన్యం పేరిట ఖాతా నెంబర్ 14 65 లో వన్ బి మంజూరు చేసుకున్నారు. భూమిని చదును చేస్తామని లీజుకు ఇవ్వండని నమ్మబలికి ఏకంగా బడుగు బలహీన వర్గాల దళిత ఎస్సీ, ఎస్టీ భూములను కొట్టేసే ప్రయత్నం చేశారని దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు పత్రాలను సృష్టించి తమ భూములు దక్కించుకోవాలని కుట్ర పన్నిన కుశలవ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటంలో భాగంగా కొర్లకుంట గ్రామ నివాసి కుశలవ భూ బాధితుడు, దళిత యువరైతు కుశలవ ఆక్రమణలో ఉన్న తన సొంత పొలంలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతిచెందిన యువరైతు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కుశలవ కంపెనీ అక్రమాలపై అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి అసైన్డ్ చట్టం ప్రకారం నాడు ప్రభుత్వం ఎవరికి భూములను కేటాయించిందో వారికి ఇవ్వాలని లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతు ఆత్మహత్య వార్త తెలిసిన వెంటనే లేపాక్షి తహశీల్దార్ కె.బాబు, రూరల్ సిఐ వేణుగోపాల్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం జిల్లా ప్రభుత్వ అనుపత్రికి తరలించారు.

పెనుకొండ ఎమ్మెల్యే కాన్వాయ్‌పై డిటోనేటర్‌తో దాడి

పోలీసుల అదుపులో నిందితుడు

పోలీసుల అదుపులో నిందితుడు గణేష్

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పెనుగొండ ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర నారాయణ కారుపై ఆగంతకుడు ఎలక్ట్రికల్ డిటోనేటర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఆదివారం గోరంట్లలో జరిగిన ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గడ్డం తండా పంచాయతీలోని కల్లితండాలో జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనడానికి కారులో బయలుదేరాడు. కల్లితండాకు చేరుకున్న శంకరనారాయణ తన వాహనం దిగి కొంత దూరం వెళ్లగానే పక్కనే ఉన్న ఆగంతకుడు ఎలక్ట్రికల్ డిటోనేటర్‌ను ఎమ్మెల్యే వాహనంపై విసిరాడు. గమనించిన డ్రైవర్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సిఐ సుబ్బరాయుడు కారువద్ద పడిఉన్న డిటోనేటర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అయితే ఈ సంఘటనతో నాయకులు, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరానారాయణ విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లుగా పెనుకొండ నియోజకవర్గంలో ఎలాంటి ఫ్యాక్షన్‌కు తావివ్వకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పాలన అందిస్తున్నాని అన్నారు. అయితే ఇది గిట్టనివారు ఇలాంటి పనికి ఒడిగట్టారని విమర్శించారు. ఈఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను బయటకు తీయాలని కోరాడు. ఈ సంఘటనపై సిఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ సోమందేపల్లి మండలం గుడిపల్లి గ్రామానికి చెందిన గణేష్ నాసన్ లో రాళ్లు తొలగించే వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. అయితే ఆదివారం అతిగా మద్యం సేవించి వెళ్లడంతో కాంట్రాక్టర్ రమణ గణేష్‌ను పనిలోకి పిలుచుకోలేదన్నారు. దీంతో గణేష్ సోమందేపల్లి మండలం నుండి వాహన ర్యాలీకి వస్తున్న ద్విచక్ర వాహనాలలో వచ్చి ర్యాలీలో పాల్గొని తిరిగి కల్లితండాకు చేరుకొని తన జేబులో ఉన్న డిటోనేటర్‌ను మద్యం మత్తులో విసిరాడని వివరించారు. ఈఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేపై దాడి సమాచారం అందుకున్న శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వి మాధవరెడ్డి, పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా గోరంట్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి జరిగిన సంఘటనపై సిఐ సుబ్బరాయుడుతో సమీక్షించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పూర్తిస్థాయిలో విచారణ అనంతరం వివరాలు మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరానారయణ సోదరులు మల్లికార్జున, రవీంద్ర తదితరులు గోరంట్లకు వచ్చి పరిస్థితినిఅడిగి తెలుసుకున్నారు.

గోరంట్ల పోలీసుస్టేషన్ వద్ద ఎస్పీ, తదితరులు

కష్టాల కడలిలో గొర్రెల కాపరులు

పట్టించుకోని పాలకులు

అటవీప్రాంతంలో గొర్రెలమంద వద్ద తాత్కాలిక నివాసం ఏర్పరచుకున్న గొర్రెల కాపరులు

ప్రజాశక్తి గుడిబండ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని రంగాల్లోనూ అత్యంత వెనుకబడిన ప్రాంతం మడకశిర నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలోని గుడిబండ, రొళ్ల, అగలి, అమరాపురం, మడకశిర, మండలాలు కర్నాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతాలకు ఆనుకుని ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో ఎక్కువ శాతం జనాభా ఉన్న యాదవ సామాజికవర్గం గొర్రెల మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. గొర్రెలు మేపుకుంటూ వాటిని సంరక్షించుకోవడానికి వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వారు ఒకసారి గొర్రెలను తీసుకొని మేపడానికి ఊరు వదిలి వెళితే సంవత్సరం తర్వాత గాని వారి గ్రామాలకు గొర్రెలతో పాటు రారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన గొర్రెల కాపర్లు జట్లు, జట్లుగా ఏర్పడి అక్కడక్కడ రైతుల పొలాల్లో రాత్రి వేళల్లో గొర్రెలను మందను ఏర్పాటు చేసుకొని ఉంటారు. 15 రోజుల నుంచి నెల దాకా రైతుల పొలాల్లో గొర్రెలు, గొర్రె పిల్లలకు స్థావరాలు ఏర్పరచుకొని రాత్రివేళలో కంటికికునుకు లేకుండా రాత్రంతా మేలుకొని గొర్రెలను, గొర్రె పిల్లల్ని కాపాడుకుంటూ ఉంటారు. వీరు రైతుల ఇచ్చిన బియ్యం, పిండి, కూరగాయలతో వంటలు వండుకొని అక్కడే తిని పండుకుంటుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చుట్టుపక్కల ఉన్న రైతుల పొలాల్లో గొర్రెలను మేపుకుని తిరి సాయంత్రానికి గొర్రెల మంద స్థావరాలకు చేరుకొని అన్నం వండుకొని తిన్న తర్వాత రాత్రంతా మేలుకొని గొర్రెల్ని, గొర్రె పిల్లలకు కాపలాగా ఉంటారు. రాత్రి వేళల్లో వారు అడవుల్లో ఎలాంటి విద్యుత్ సౌకర్యం లేక టార్చ్ లైట్లు వెలిగించుకొని జాగారణ చేస్తుంటారు. వాననకా, ఎండనకా అక్కడే కాలం గడుపుతుంటారు. ఇక వర్షాకాలంలో ఉరుములు, పిడుగులకు భయపడకుండా విష జంతువులు, ఎలుగుబంట్ల దాడుల నుంచి తమ గొర్రెలను రక్షించుకుంటూ తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అడవుల్లో బిక్కుబిక్కుమంటూ జీవనం చేస్తుంటారు. చాలా సందర్భాల్లో రాత్రి వేళల్లో గొర్రెల మందపై చిరుతలు, వీధికుక్కలు దాడులు చేసి గొర్రె పిల్లల్ని మేక పిల్లల్ని చంపిన సందర్భాలు కూడా కోకొల్లలుగా ఉన్నాయి. ఇక గ్రామాల్లో ఎలాంటి పండుగలు పబ్బాలు జరిగిన గొర్రెల కాపర్లు వాటికి దూరమై సంవత్సరాల తరబడి తల్లిదండ్రులను, భార్య పిల్లల్ని, వదిలి వందలాది కిలోమీటర్ల దూరంలో జీవనం సాగిస్తుంటారు. రాత్రివేళల్లో గొర్రెల కాపర్లు విషపురుగులు, పాముకాటుకు గురై వారికి అడవుల్లో సరైన చికిత్స అందక ఎంతోమంది మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇలా మృతిచెందిన గొర్రెల కాపరుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకున్న దాఖలాలు లేవు. ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎంత మంది ప్రజాప్రతినిధులు మారినా తమ గొర్రెల కాపరుల బ్రతుకులు మాత్రం మారలేదనీ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిరనియోజకవర్గంలో యాదవ సామాజికవర్గానికి చెందిన ఇరువురు ముఖ్య నేతలు మాజీమంత్రి రఘురారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కూడా గొర్రెల కాపర్ల సమస్యల పరిష్కారంపై దష్టి సారించకపోవడం శోచనీయమని గొర్రెలకాపరులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వాలు స్పందించి గొర్రెల కాపరుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని గొర్రెలకాపరులు కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రచార ఉద్యమం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో సూడోసైన్స్ భావాలు, మూఢనమ్మకాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో శాస్త్రీయ ప్రచారాన్ని ఉద్యమంగా చేపడుతున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. జెవివి జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జెవివి జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ అక్టోబర్ 8వ తేదీ నుంచి 6 నెలల పాటు సమాజంలో శాస్త్రీయ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాయాత్రలు, సదస్సులు, మ్యాజిక్ షోలు, వర్క్ షాపుల ద్వారా శాస్త్ర ప్రచార ఉద్యమాన్ని విద్యార్థుల్లోకి తీసుకువెళుతున్నట్లు వివరించారు. జిల్లాలో శాస్త్ర ప్రచార కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. జన విజ్ఞాన వేదికలో వివిధ విభాగాలు తమ కమిటీలను ఎంపిక చేసుకుని, కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. ప్రజాతంత్ర పనివిధానాన్ని అందరూ అర్థం చేసుకోవాలని సూచించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో సైన్సు ప్రచారం పట్ల ఆసక్తి ఉన్నవారందరూ జెవివిలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు భాస్కర్, కోశాధికారి జిలాన్, కార్యదర్శివర్గ సభ్యులు రఘురామయ్య, చిత్తప్ప, వీరరాజు, రామిరెడ్డి, ప్రసూన, విజయలక్ష్మి, జగదీష్‌తో పాటు యూత్, సోషల్ మీడియా, మ్యాజిక్, కల్చరల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఐఎంఎ హాల్‌లో 'ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత అనే' అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన చర్చా వేదికకు పలు సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు. ప్రజారోగ్య వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొండయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధికంగా నిధులు కేటాయించి మెరుగైన వైద్యం క్షేత్రస్థాయిలో అందేలా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం సిహెచ్‌లు, పిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లు పటిష్ట పరుస్తూ సామాన్య పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువయ్యేందుకు కృషి చేయాలన్నారు. విద్య వైద్య రంగాల్లో పూర్తిస్థాయి ప్రభుత్వ భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రజారోగ్య వేదిక అధ్యక్షులు డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ ప్రజారోగ్య వేదిక ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్యం అందేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సుమారుగా 16 మండలాలు, మూడు పట్టణాల్లో ప్రజారోగ్య వేదిక ద్వారా సర్వే చేసి ప్రజాభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. మూడు క్యాటగిరీలుగా చేసిన ఈ సర్వేలో ప్రజలు 75శాతం విద్య వైద్యానికి ఖర్చు చేస్తున్నట్లు తెలియవచ్చిందన్నారు. ప్రజారోగ్య వేదిక కార్యదర్శి శ్రీనివాస రావు మాట్లాడుతూ అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఎంతోమంది పేద ప్రజలకు వైద్యం అందుతుందని తెలిపారు. నేడు వైద్యం ఖరీదైన వస్తువుగా మారిందని ప్రభుత్వం ఆలోచించి పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ వైద్య రంగంలో ముఖ్యంగా ప్రభుత్వ వైద్య సేవల విషయంలో లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల లేమి పేరుతో ప్రజలకు సేవలు అందించకుండా దాటవేత ధోరణితో ప్రభుత్వం వ్యవహరించడం సరైనది కాదన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వీరభద్రయ్య మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రతిష్ట పరిచేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విధానాలను పరిశీలించి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్, సామాజికవేత్త నబిరసూల్, రామకృష్ణ, ఎల్ఐసి నాయకులు రామకృష్ణ, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాజమోహన్, జాయింట్ కన్వీనర్ ఎంఎన్‌టి రాజు, ప్రజాశక్తి బుక్ హౌస్ సిబ్బంది రాయుడు, యుటిఎఫ్ నాయకులు జిలాన్, ఎపిఎంఎస్ఆర్‌యు రాజేష్, పలు సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చర్చావేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

కూలీలందరికీ 'ఉపాధి'

డిడబ్ల్యూఎంఎ పీడీ రామాంజనేయులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలు పనులు కల్పించి వలసలు నివారించడమే తమ ప్రథమ కర్తవ్యమని శ్రీ సత్య సాయి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు పేర్కొన్నారు. కూలీలకు అనుగుణంగా వారికి ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందుకోసం శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం, ల్యాండ్ లెవెలింగ్ తదితర పనులు చేపట్టి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: ఈ ఏడాదిఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి ఎలాంటి ప్రణాళికలు తీసుకుంటున్నారు.?

జవాబు : ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 54 లక్షల పని దినాలను కల్పించాం. అందుకోసం రూ.1.30 కోట్లు ఖర్చు చేశాం. జిల్లా వ్యాప్తంగా 50 వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా పండ్ల తోటలు పెంపకం కార్యక్రమం చేపట్టాం. ఇందుకోసం ఉపాధి పథకం ద్వారా మూడు సంవత్సరాలు పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు ప్రోత్సాహం ఇస్తున్నాం. ఉపాధి పనుల ద్వారా వలసలు నివారిస్తున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కావాల్సిన పనులను గుర్తింపు కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో జరుపుతున్నాం. జియోగ్రఫీ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా నీటి సంరక్షణ పనులు, ఉమ్మడి ఆస్తుల పునరుద్ధరణ వ్యక్తిగత పనులను గుర్తించి, అంచనాలు తయారు చేసి పరిపాలన అనుమతులు తీసుకొని పనులు కల్పిస్తున్నాం.

ప్ర: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ఏయే పనులు జరుగుతున్నాయి?

జ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని నిర్ణయించాం. 15 రకాల పండ్ల మొక్కలు రెండు రకాల కాయగూరలు పెంపకం కోసం రైతులకు ఉపాధి హామీ ద్వారా అవకాశం ఇస్తున్నాం. ఇప్పటికే రెండువేల ఎకరాలు పూర్తి అయింది. 15 రోజుల్లోపు 4వేల ఎకరాల పండ్ల తోటల పెంపకం పూర్తి అవుతుంది. చెత్తతో సంపద కేంద్రాల నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. వాటితోపాటు రోడ్డు పనులు కల్పిస్తున్నాం.

ప్ర : నీటి సంరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ : జిల్లా వ్యాప్తంగా వర్షపు నీటి నిల్వ కోసం చెరువులు కుంటలలో పూడికతీత పనులు చేపట్టాం. మూడు వాటర్‌షెడ్లు ఏర్పాటు చేశాం. ధర్మవరం మండలం ఏలుకుంట్ల, ఎన్పీ కుంట మండలం మర్రి కొమ్మదిన్న, పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులు చేపట్టాం. వాటి ద్వారా 50 కోట్ల రూపాయల నిధులతో చెరువుల్లో పూడికతీత పనులు, చెక్ డాముల నిర్మాణం, రాక్ ఫీల్డ్ డ్యాములు, కందకాలు తదితర పనులతో పాటు ప్రభుత్వ భవనాలు, సచివాలయాలు, ఉన్నత పాఠశాలలు, గ్రామ సచివాలయాల వద్ద వర్షపునీరు నిల్వ చేయడానికి ఇంకుడు గుంతలను జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 350 నిర్మించాం. వాటికి ఒక్కొక్క దానికి రూ. 50 వేల నుండి లక్ష రూపాయల దాకా ఖర్చు చేస్తున్నాం. దీనిద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందడమే కాక చుట్టుప్రక్కల బోర్లు రీఛార్జి కానున్నాయి.

ప్ర : ఉపాధి హామీ పథకంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అవినీతిపై మీ సమాధానం?

జ : ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లింపు జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. కేంద్ర ప్రభుత్వం నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద బిల్లులు మంజూరు చేయాల్సి ఉండటంతో ఈ జాప్యం జరుగుతోంది. ఉపాధి కూలీలు పనులు విషయంలో అవినీతి జరగడానికి ఆస్కారం లేదు. చాలా చోట్ల అవినీతిపై విచారణ చేపట్టాం. దానికి తోడు సామాజిక తనిఖీలు ప్రతి సంవత్సరం నిర్వహించి ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా అందులో అవినీతి బయటపడిన వెంటనే సొమ్ము రికవరీ చేస్తున్నాం. కొంతమంది గ్రామంలో లేనివారు ఉపాధి బిల్లులు పొందుతున్నారని తమ దృష్టికి రావడంతో ఆ గ్రామాలకే వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అందులో ఎలాంటి అవినీతి జరగలేదు.

ప్రజాశక్తి www.prajasakti.com

పుట్టపర్తిలో దీక్షలో పాల్గొన్న టిడిపి శ్రేణులు, పెనుకొండలో 'బాబుతో నేను' కరపత్రాలు పంపిణీ చేస్తున్న సవితమ్మ, మడకశిరలో శిబిరంలో మాట్లాడుతున్న గుండుమల

కొనసాగిన తెలుగుతమ్ముళ్ల నిరసనాగ్రహం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ముస్లిం మైనారిటీలను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటానని నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలకు ముస్లిం సామాజికవర్గం ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. కందికుంట మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ఇమామ్, మౌజాన్లకు ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం ద్వారా ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా కదిరి నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా, ముస్లిం నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల పరిధిలోని హారేసముద్రంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా గుండుమలతో పాటు తెలుగుతమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రంగే గౌడ, నాగరాజు, సుబ్బరాయుడు, గోపాల్, వడ్డే రఘురాం, కౌన్సిలర్ ఉమాశంకర్, హనుమం తగౌడ, మల్లికార్జున, కృష్ణమూర్తి, జయకుమార్, సీనియర్ నాయకులు నరసింహా రెడ్డి, కిష్టప్ప, రవీంద్రారెడ్డి, నాగేంద్ర, నరసింహప్ప, జయపాల్, తిమ్మరాజు, సోము, బద్రి, నరసేగౌడ, కుమార్, మహిళలు పాల్గొన్నారు.

ధర్మవరంటౌన్ : ఫ్యాక్షనిస్టుల పాలనలో ప్రజాస్వామ్యం మంటగలుస్తోందని టిడిపి నాయకులు మండి పడ్డారు. చంద్రబాబు అరెస్టుని నిరసిస్తూ స్థానిక చెరువులో తెలుగుతమ్ముళ్లు జలదీక్ష చేపట్టారు. జలదీక్షలో నాయకులు కమతం కాటమయ్య, పరిసే సుధాకర్, బొట్టు కిష్టప్ప, కేశగాళ్ల శ్రీనివాసులు, గోసల శ్రీరాములు, అడ్డా మహేశ్, మాధవరెడ్డి, టైలర్ గోపాల్, తోట నారాయణస్వామి, తోట వాసుదేవ, నాగేంద్ర, ఆనందరెడ్డి, మందల సురేశ్, మరున హరి, శంకర పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబుకు మద్దతుగా మండల పరిధిలోని మల్లేపల్లి పంచాయతీకి చెందిన ఏడు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణ అభిమానులు ప్రజల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. వీటిని రాష్ట్రపతికి పంపనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్ణ, వెంగముని, ప్రకాష్, దినేష్, గోపాల్, సాంబ, ఓబుళరాజు, కిష్ట, నాగరాజు, రాజా, రామాంజి, శేషప్ప, జనా, నాగర్జున, నాగేష్, లోకేష్, సుధీర్, మధు, మల్లికార్జున, చలపతినాయుడు, ఓబిలేసు, రమణయ్య, ఎన్.రాజా, రామవెంగముని, వెంకట నారాయణ, నారాయణ, రాములు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు నిరంకుశ ధోరణిలో పాలన చేస్తున్నారని, విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేసి జైలులో పెట్టారని టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మి నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని ఎల్‌జి బాలకృష్ణన్ సర్కిల్‌లో చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలకు రెడ్డి సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాలు తమ కాళ్లపై నిలబడగలిగేలా ఉద్యోగ, ఉపాధి, సాగునీటి వనరులు, అభివృద్ధి ఇలా ఆరోగ్య వంతమైన సమాజాన్ని అందించిన పరిపాలనాదక్షుడు చంద్రబాబు అని కొనియాడారు. అనంతరం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌కుమార్, నాగరాజు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ఒక్క ఛాన్స్ అంటూ నమ్మి ఓటు వేసిన పాపానికి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని టిడిపి నాయకులు విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో నాయ కులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. చంద్రబాబు బయటకి వచ్చేంత వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మయ్య, సామకోటి ఆదినారాయణ, నాగేంద్రప్రసాద్, రత్నప్పచౌదరి, పుల్లప్ప, పేపర్ గంగాద్రి, కొత్తచెరువు శ్రీనివాసులుచౌదరి, మహిళలు పాల్గొన్నారు.

పెనుకొండ : వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ఆమె టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలో వారపు సంత, కోర్టు రోడ్డు, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్, అంబేద్కర్ సర్కిళ్ల మీదుగా ప్రజలు, వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబుకి మద్దతుగా 92612 92612 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.

హిందూపురంలో ఒంటి కాలుపై నిల్చొని నిరసన తెలుపుతున్న నాయకులు, కదిరిలో దీక్షలో మాట్లాడుతున కందికుంట

ఆర్థికసాయం అంజేస్తున్న బత్తల

వైద్య ఖర్చులకు 'బత్తల' ఆర్థికసాయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో సమీపంలో ఈ నెల 3వ తేదీ జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బూర్సు వడ్డే గంగరాజుకు ఆదివారం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 20వేలు అందజేశారు. కౌన్సిలర్ మహబూబ్‌బాషా ద్వారా గంగరాజు విషయం తెలుసుకున్న బత్తల హరిప్రసాద్ స్పందించి బాధితుడి భార్య సుస్మితకు బత్తల వెంకటరమణ ద్వారా రూ. 20వేలు అందజేశారు. కార్యక్రమంలో బాహుద్దీన్, వైసిపి లీగల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి లింగాల లోకేశ్వర్‌రెడ్డి, బిసి నాయకులు సంపంగి గోవర్ధన్, బాబా, నజీర్, బత్తల యుగంధర్, అల్లుగుండు నారయణస్వామి, కోటకొండ కృష్ణప్ప, బత్తల శ్రీనివాసులు, జయచంద్ర, శ్రీకృష్ణ, వినోద్, అక్రమ్‌బాషా, బలపాల చంద్ర, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపిపి అమర్‌నాథ్‌రెడ్డి

బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మండల పరిధిలోని యర్రదొడ్డి గ్రామం ఎరుకలవాండ్లపల్లికి చెందిన వనర్చ సరస్వతి ఇంట్లో ప్రమాదవశాత్తూ మంటలు రేగి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపిపి అమరనాథరెడ్డి ఈ విషయాన్ని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన తక్షణ సాయంగా రూ. 10 వేలు అందజేయగా ఆ మొత్తాన్ని ఎంపిపి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి అమర్ నాథరెడ్డి, గృహసారథులు, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐకి పలువురి అభినందనలు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నూతన ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని అల్లాపల్లి గ్రామ సర్పంచి మాకం వెంకటరమణ, బిసి హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు ఎం ఎస్ షబ్బీర్ వేర్వేరుగా శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో అల్లాపల్లి మాజీ సర్పంచి మైలారి నాగభూషణం, రామ్మోహన్‌రెడ్డి, బొల్లం ఈశ్వర్‌రెడ్డి, గౌనిపల్లి యువ సేన మల్లెల రమేష్, రామచంద్ర, అల్లా బకాష్, మహమ్మద్ బాషా, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని అభినందిస్తున్న నాయకులు

గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

రాష్ట్రంలో గిరిజనుల సమగ్ర అభివృద్ధికి సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని గడ్డంతండా గ్రామపంచాయతీలోని గడ్డం తండా, కల్లితండా, కొమ్ములుతండాలో ఆదివారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొనగా స్థానిక నాయకులు బాణసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ముందుగా ఆయన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి వాసుదేవనాయక్, జడ్పిటిసి జయరామ్‌నాయక్, వైస్ ఎంపిపిలు నాగభూషణ్‌రెడ్డి, గోరంట్ల సర్పంచి సరోజనాగే నాయక్, ఉప సర్పంచి రాజారెడ్డి, అగ్రి అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరు శంకర్‌రెడ్డి, జవకులదిన్నె సుబ్బారెడ్డి, నార్సింపల్లి శివారెడ్డి, బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, బుల్లెట్ బాబు, సర్పంచులు నర్సిరెడ్డి, శివమణిరెడ్డి, ముసలిరెడ్డి, విజయసింహారెడ్డి, పాటూరి లక్ష్మిరెడ్డి, సమరసింహారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకరనారాయణను సన్మానిస్తున్న గిరిజనులు

సాదత్‌అలీఖాన్ జన్మదినం సందర్భంగా బైక్ ర్యాలీ

కదిరి టౌన్ : పట్టణానికి చెందిన వైసిపి మైనార్టీ నాయకులు సాదత్ అలీఖాన్ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే రూరల్ మండల పరిధిలోని మొటుకుపల్లి ఆర్‌డిటిలో సాదత్ అలీఖాన్ బధిరుల పాఠశాలలో బుద్ధిమాంద్యం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, శేషు, ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న సాదత్

చిత్రావతి నదిలో ఘనంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కోనసీమ జిల్లాల నుంచి వచ్చిన పర్తి యాత్రికులు భక్తులు ఆదివారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి చిత్రావతి నదిలో కనుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ ప్రారంభించారు. చెక్ డ్యాం నిర్మించడం వల్ల తెప్పోత్సవం నిర్వహించడానికి అనుకూలంగా మారింది. మొదటిసారిగా చిత్రావతి నదిలో ఈ వేడుకలు నిర్వహించడం భక్తులను అలరించింది. కోనసీమ జిల్లాల నుంచి సుమారు 2 వేల మంది భక్తులు పుట్టపర్తికి పర్తియాత్రగా వచ్చారు. తెప్పోత్సవం తిలకించడానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తుల సాయి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు సత్యసాయి సేవా దళ్ సభ్యులు పర్యవేక్షించారు.

హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మండల టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులుగా వరప్రసాద్

ప్రజాశక్తి-గుడిబండ

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం మండల టిఎన్ఎస్ఎఫ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మైనగానపల్లి గ్రామానికి చెందిన జ్ఞాన రుక్ష ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వరప్రసాద్‌ను ఎంపిక చేశారు. గుండుమల మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించే దిశగా విద్యార్థి సంఘం నాయకులు పని చేయాలని సూచించారు. వరప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు జవనడుకు రంగ, నాయకులు లోకేష్, మాధవ్, నవీన్, చిత్తప్ప, గోపాల్, మంజునాథ్, రామంజి, రవి, గోవిందు, నాగేంద్ర, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తి, రంగాను సన్మానిస్తున్న వరప్రసాద్

ర్యాలీ నిర్వహిస్తున్న ఖాదీ సొసైటీ సభ్యులు, విద్యార్థులు

ఖాదీ దుస్తులే వాడండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలే వాడాలని ఖాదీ సొసైటీ సెక్రటరీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఖాదీ మహోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో గ్రామోద్యోగ ఖాదీ శిల్క్ సొసైటీ సెక్రటరీ ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు, స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రం ఆదేశాల మేరకు ఖాదీ మహోత్సవాన్ని ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరరూ నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఖాదీ వస్త్రంపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం(నేడు) స్పందన గ్రీవెన్స్‌ను యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలలో కూడా 'స్పందన' చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

10న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం పట్టణంలో ఈ నెల 10వ తేదీ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ బాలుర జూనియర్, సీనియర్ బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు హ్యాండ్‌బాల్ అసోషియేషన్ జిల్లా సెక్రటరీ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జూనియర్ బాలురకు సంబంధించి 1-01-2004 తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. సీనియర్ బాలికలకు సంబంధించి అందరూ అర్హులే అన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, 5 సర్టిఫికెట్స్ తీసుకుని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 89781 37522, 80747 99673 నంబర్లను సంప్రదించాలన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా ఫయాజ్‌అహ్మద్

ప్రజాశక్తి-తలుపుల

మండల వైసిపి కన్వీనర్‌గా మరోమారు తనను అధిష్టానం నియమించినట్లు ఆదివారం ఫయాజ్ అహమ్మద్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ తనను రెండోసారి మండల కన్వీనర్‌గా నియమించినందుకు సిఎం జగన్, సహకరించిన ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా పార్టీలో అందరినీ కలుపుకొని పోయి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తానన్నారు. మండలంలో ఎలాంటి వర్గాలు లేవన్నారు.

బదిలీ ఎస్‌ఐకు సన్మానం

ప్రజాశక్తి-తనకల్లు

స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఎస్ఐ రాంభూపాల్‌యాదవ్‌ను ఆదివారం మండల ప్రింట్ మీడియా విలేకరులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ రాంభూపాల్‌యాదవ్ నిరంతరం పేద ప్రజలకు అండగా ఉంటూ శాంతి భద్రతలను కాపాడడంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో విలేకరుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, శివశంకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నేత రామకృష్ణారెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతి సభ ఆదివారం చౌళూరు గ్రామంలో వేలాది మంది అభిమానుల మధ్య నిర్వహించారు. వర్ధంతి సభకు ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి నాయకులు హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం వైసిపి నాయకులు వేణురెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, సానే ఉమారాణి, మద్దెలచెరువు సుధీర్‌రెడ్డి, సల్లపల్లి బాబురెడ్డి, నాగులూరు బాబురెడ్డి, వేపకుంట కృష్ణారెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, గుడ్డం వేణురెడ్డి, ఫైరోజ్, బాలాజీ మనోహర్, ఉదయ్, కౌన్సిలర్లు, రెడ్డి సంఘం నాయకులు, ముస్లింలు, పెద్దఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అహర్నిషలు కష్టపడి పదవులు ఆశించకుండా తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న సీనియర్ నాయకుడు కంబాలపల్లి గ్రామానికి చెందిన సురెంద్రరెడ్డి ఆదివారం మృతి చెందాడు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల ఎంపిపి పురుషోత్తమరెడ్డితో పాటు పలువురు విచారం వ్యక్తం చేశారు. సురేంద్రరెడ్డి మృతి వైసిపికి తీరని లోటు అని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వాల వైఖరితో కార్మికులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-నల్లచెరువు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి వల్ల రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జగన్‌మోహన్ ధ్వజమెత్తారు. నల్లచెరువులో ఆదివారం సిఐటియు మండల కమిటీ సభ్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించగా జగన్‌మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటి గురించి మాట్లాడలేని పరిస్థితు ల్లో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గులాం గిరీ చేస్తూ అన్ని రంగాల్లో పని చేసే కార్మికుల హక్కులు కాలరాస్తూ కార్మికుల ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతోందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పని లేక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అనంతరం 'విద్యుత్ సంస్కరణల పేరు తో రైతులు, ప్రజలపై వేస్తున్న భారాలు' అనే అంశంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. తదుపరి నిర్వహించిన ఎన్నికలో మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా జె.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కన్వీనర్ మాట్లాడుతూ నిత్యం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తానని తెలిపారు. సమావేశంలో పద్మావతి, సరస్వతి, క్రిష్ణప్ప, ఆంజనేయులు, సదాశివ, ఆంజనేయులు, వై.రామ్మోహన్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

గ్రామస్వరాజ్య స్థాపనే లక్ష్యంగా జగన్ పాలన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా సిఎం జగన్ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వ్యవస్థలతో ప్రజల వద్దకే పరిపాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యా లయంలో ఆదివారం వైసిపి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడా రు. వైసిపి పాలనలో రాష్ట్రంలో సంక్షే మం, అభివృద్ధి జరుగుతుందని కావున ఎపికి జగనే కావాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిని వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో టౌన్ కన్వీనర్ కొళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, ఎంపిపి పర్వీన్‌బాను, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, షామీర్‌బాషా, జోలిబాబా, భాస్కర్‌రెడ్డి, సర్పంచులు గోవిందు, రంగారెడ్డి, వెంకటరమణ, బాబాఫకృద్దీన్, అబిద రఫిక్, అల్లాపల్లి శ్రావణి, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండలంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వైసిపి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెనుగొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరయ్యారు. ర్యాలీ పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ప్రారంభమై పట్టణ వీధుల మీదుగా గుమ్మయ్యగారిపల్లి వరకూ నిర్వహించారు. అక్కడ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం గడ్డం తండా పంచాయతీలో నిర్వహించే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో జడ్పిటిసి పాలే జయరాంనాయక్, వైస్ ఎంపిపి నాగభూషణరెడ్డి, గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచి సరోజనాగేనాయక్, ఉపసర్పంచి రాజారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరు శంకర్‌రెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ సమర సింహారెడ్డి, నార్సింపల్లి శివారెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మేదర శంకర, బుల్లెట్ బాబు, విజయసింహారెడ్డి, శివమణిరెడ్డి, గోవిందరెడ్డి, సాయి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

బాధితులకు సవిత పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో టిడిపి కార్యకర్తలను ఆదివారం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ పరామర్శించారు. కల్లుకుంట గ్రామానికి చెందిన కార్యకర్త వెంకట రాముడు కుమారుడు బాలు కాలు విరిగి హాస్పిటల్‌లో చికిత్స పొంది అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చులకు ఆర్థిక సా యం అందజేశారు. నల్లూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు శ్రీరామప్ప అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమెతో పాటు నాయకులు మాధవనాయుడు, కల్లుకుంట హనుమంతు, నల్లూరు గోపాల్, ఎంఆర్‌పిఎస్ నాగరాజు, వెంకటేష్, ప్రసాద్, మునప్ప, భాను, గోపాలప్ప, సుబ్బరాయప్ప ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సవితమ్మ

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి : ఎస్ఐ

ప్రజాశక్తి-గాండ్లపెంట

గ్రామాల్లో ప్రజలు ఫ్యాక్షన్, కక్షలు, కార్పణ్యాలు, గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం గడపాల ని ఎస్ఐ ఎ.వెంకటనారాయణ సూచించారు. మండల పరిధిలోని మల్లమీదపల్లి, కోటూరు, సామసేను బైలు, తదితర గ్రామాల్లో ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడు తూ ఎవరూ అవసరమైన విషయాల్లో కలుగజేసుకోవద్దని, గొడవలకు వెళ్ల వద్దని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలను విద్యావంతులు చేయాలన్నారు. మద్యం తాగి గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కి వచ్చి తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సమావేశంలో పోలీసు సిబ్బంది నాగరాజ్, బాలాజీనాయక్, గురుప్రసాద్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటనారాయణ

కంటిచూపును ప్రసాదించడమే రోటరీ క్లబ్ ధ్యేయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కంటి చూపు మందగించిన వారికి తిరిగి కంటిచూపును ప్రసాదించడమే ధ్యేయమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహా, కార్యదర్శి నాగభూషణం పేర్కొన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జయసింహా మాట్లాడుతూ రోటరీ క్లబ్ స్థాపించినప్పటి నుంచి 36 వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. ప్రతి నెలా క్లబ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 134 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 101 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు మేరు, కోఆర్డినేటర్ శివప్రకాశ్, క్లబ్ కోశాధికారి సుదర్శన్‌గుప్తా, ఆర్గనైజర్స్ సత్రశాల ప్రసన్నకుమార్, రమేష్‌బాబు, శివయ్య, సోలిగాళ్ల వెంకటేశు, బివి చలం, శ్రీనివాసరెడ్డి, నరేంద్రరెడ్డి, పెరుమాళ్ల దాస్, రామిరెడ్డి, రామకృష్ణ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు నాగరత్నమ్మ, సభ్యులు రాజేశ్వరి పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

మడకశిర : మండల పరిధిలోని కోడిపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు, నరసింహమూర్తి, రంగధామ, మూర్తి, రామన్న, హనుమంతరాయ, రామప్ప, మంజునాథ్, పుష్ప, గోపి తరపున 20 కుటుంబాలు ఆదివారం వైసిపికి రాజీనామా చేసి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలోకి చేరగా వారికి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ, మండల రైతు సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కోనప్పపాళ్యం కుమార్, ఉప సర్పంచి హర్షవర్ధన్‌రెడ్డి, శేఖర్, పంచాయతీ అధ్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి, బూత్ కన్వీనర్ ప్రసాద్, శ్రీనాథ్, మీడియా కో ఆర్డినేటర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



గుండుమల సమక్షంలో టిడిపి చేరిన నాయకులు